క్లుప్తంగా

మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



పొంగులేటికి శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ నాయకులు

కొణిజర్ల: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని శుక్రవారం పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు బానోత్ నాగరాజు, పాపగంటి చిన్నాబాబు, దేవర కొండలు, రంజిత్, బోడా రాము తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బస్సుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హరిప్రసాద్

ముదిగొండ: గ్రామాల్లోకి వచ్చే బస్ సర్వీస్‌ల సంఖ్య పెంచాలని ప్రజాప్రతినిధులు కోరారు. ముదిగొండలోని శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. గ్రామాల్లో బస్ సర్వీల సంఖ్య తగ్గింకచడంతో.. విద్యార్థులు కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మన ఊరు – మన బడిలో చేపట్టిన పనులు పూర్తిచేయాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ దుర్గ, వైస్ ఎంపీపీ దామోదర్, ఎంపీడీఓ అశోక్, డిటీ రెహమాన్, ఎంపీఓ సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



పాఠశాలకు కంప్యూటర్ అందిస్తున్న ఐఈఆర్పీ కృష్ణారావు

చింతకాని: మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాలకు ఐఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ భాగవతుల శివశంకర్ వితరణ చేసిన కంప్యూటర్‌ను ఐఈఆర్పీ కేవీఎస్ కృష్ణారావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ హుస్సేన్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, నర్సింహారావు, సీతారామిరెడ్డి, మల్లికార్జున్‌రావు, రాంబాబు, కరుణశ్రీ, ఐఈఆర్పీ దస్లీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

సత్తుపల్లిరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన సత్తుపల్లి మండలం బుగ్గపాడులో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు మచ్చ లక్ష్మణుడు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు రావటంతో కేకలు వేసుకుంటూ బయటకు వచ్చారు. చుట్టుపక్కల వారు గమనించి నీళ్లు చల్లుతూనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేయడంతో చుట్టుపక్కల ఇళ్లకు ముప్పుతప్పింది. ఈ ఘటనలో రూ.20వేల నగదు, వంట సామాగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయని లక్ష్మణుడు తెలిపారు.

భార్యను వేధించిన వ్యక్తిపై కేసు

కారేపల్లి: భార్యను వేధించిన వ్యక్తిపై కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కారేపల్లికి చెందిన గుగులోతు నరేష్, భూక్యా రవీనకు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే, గత నెల రోజులుగా నరేష్ తన భార్యపై అనుమానంతో వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రామారావు తెలిపారు.

నేడు విద్యార్థులకు పోటీలు

సత్తుపల్లి: గీతా జయంతి పర్వదినం సందర్భంగా శనివారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గట్టే వాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు గీతాశ్లోకం-భావం-స్వీయ వ్యాఖ్యానం అంశంపై వ్యాసరచన పోటీ, భగవద్గీత–ఆవశ్యకత అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించటం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలలోపు బాల బాలికలు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు.

‘రైతుబంధు’కు దరఖాస్తు చేసుకోండి

- కొత్త పాస్‌పుస్తకాలున్న రైతులు అర్హులు
- నియోజకవర్గంలో 3వేలు దరఖాస్తులు



రైతుబంధు దరఖాస్తు ఫారం



ముదిగొండ: వ్యవసాయ భూములను పలువురు రైతులు కొన్నా.. అమ్మినా.. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆ తర్వాత కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతుబంధు పొందేందుకు వ్యవసాయ అధికారులను సంప్రదించాల్సి ఉంది.

రైతు వేదికల్లో వివరాలను సమర్పించాలి..

ముదిగొండ మండలంలోని కొత్త పాస్ పుస్తకాలు పొందిన రైతులు.. రైతుబంధు కోసం తమ పంట భూములకు సంభందించిన పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్సులతో సమీపంలోని రైతు వేదికల్లో సమర్పించిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం అందించే రైతుబంధు పథకం వర్తించనుంది. దీనిపై గ్రామాల్లో రైతులకు వ్యవసాయశాఖ నుంచి ఏఈఓల ద్వారా అవగాహన కల్పించి నమోదు ప్రక్రియ చేపట్టాలి.

నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల దరఖాస్తులు..

నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో అధికారులు రైతులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంది. ముదిగొండ మండలంలోని వల్లబి, బాణాపురం, వనంవారికిష్టాపురం, చిరుమర్రి, మాధాపురం, ముదిగొండ, పమ్మి క్లస్టర్లలోని రైతు వేదికల్లో ఏఈఓలు రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. రైతులు అవగాహన కలిగి తమ దరఖాస్తులను ఇచ్చిన వెంటనే వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్ చేస్తారు. మధిర నియోజకవర్గంలో ముదిగొండ, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో దాదాపు 3వేల మంది ఉన్నారు. ఈప్రక్రియ పూర్తిచేసేందుకు వ్యవసాయ అధికారులు సిద్ధమవుతున్నారు.

మండలంలోని క్లస్టర్ల వారిగా...

బాణాపురంలో 67, కమలాపురంలో 72, మాధాపురంలో 62, ముదిగొండలో 49, ముత్తారంలో 129, పమ్మిలో 107, వల్లబిలో 61మంది రైతులు తమ కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

గ్రామాల్లో రైతులకు సూచించాం..



కొత్త పాస్ పుస్తకాలు కలిగిన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకాలు దరఖాస్తు చేసుకోవాలని, దానికి సంభందించిన వివరాలతో కూడిన దరఖాస్తు ఫారాలను మండలంలోని 7క్లస్టర్లలో ఏఈఓల ద్వారా అందజేశాం. రైతులు దరఖాస్తులు అందజేస్తే వెంటనే ఆన్‌లైన్ చేస్తాం.

– మందుల రాధ, మండల వ్యవసాధికారి, ముదిగొండ

ఆన్‌లైన్ కావడం లేదని చెబుతున్నారు..



కొత్త పాస్ పుస్తకం వచ్చింది. రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్నా.. కానీ ఆన్‌లైన్ కావడం లేదని ఏఈఓ చెబుతున్నాడు. ఆన్‌లైన్ సైట్ ఓపెన్ అయితే వెంటనే చేస్తామన్నారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. పూర్తి అయితే రైతుబంధు నగదు పడతాయి.

– యడవల్లి రమేష్, వల్లబి

అండర్ పాస్ నిర్మాణానికి పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ గణేష్

ముదిగొండ: ఖమ్మం – కోదాడ జాతీయ రహదారి నిర్మాణంలో ముదిగొండ వద్ద రైతులు పొలాలకు అండర్ పాస్ కావాలని కోరడంతో ఖమ్మం ఆర్డీఓ గణేష్ శుక్రవారం పరిశీలించారు. రహదారిపై చెరువుకట్ట సమీపంలో జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మాణం చేపట్టకపోతే తమ పొలాలకు వెళ్లడానికి 4కిలో మీటర్లు ముందుకు వెళ్లి చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని రైతులు వివరించడంతో ఆయన పరిశీలించారు. అనంతరం ముదిగొండ తహసీల్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని.. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు.

విప్లవ కార్మిక సంఘాలను ఆదరించండి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: ఈ నెల 27న నిర్వహించే సింగరేణి ఎన్నికల్లో వామపక్ష కార్మిక సంఘాలను గెలిపించాలని బొగ్గగని కార్మిక సంఘం అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బొగ్గుగని కార్మికుల పోరాటాలకు వర్తించే వేతన ఒప్పందాలను సింగరేణి కార్మికుల పోరాటాల ద్వారానే సాధించి పెట్టిన ఘనత కార్మిక సంఘలకు ఉందన్నారు. సింగరేణి కార్మిక వర్గానికి గుడ్డు, రొట్టె, బెల్లం, రోడ్లు, విద్యాసంస్థలు, విద్యుత్, వైద్యం, మంచినీరు తదితర సౌకర్యాలతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్‌ను చేయించిన ఘనత కార్మిక సంఘాలకు ఉందన్నారు. పోరాడే విప్లవ సంఘాలను ఆదరించాలని కోరారు. కావున 27న జరిగే ఎన్నికల్లో చక్రంలో సుత్తి గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కృష్ణ, బొగ్గుగని కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ జె.సీతారామయ్య, జి.రాములు, పోచమల్లు, జి.అనురాధ, ఎల్.విశ్వనాథం, రత్నకుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



శాంతాక్లాజ్ వేషధారణలో సందడి చేస్తున్న దృశ్యం



నాటకం ప్రదర్శిస్తున్న బాల బాలికలు

వైరా: వైరా శాంతినగర్‌లోని మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్, తల్లిదండ్రుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తల్లాడ క్రీస్తు జ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ శ్రీకాంత్, హోలీ ట్రినిటీ చర్చి ఫాదర్ జ్యాన్నేసు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించడంతో పాటు రోజులో కొద్ది సమయాన్ని పిల్లల కోసం కేటాయించాలన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓ విద్యార్థి శాంతాక్లాజ్ వేషధారణతో సందడి చేశాడు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సోఫియా, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ నీనా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు క్రిస్మస్ దుస్తుల పంపిణీ..

– హాజరుకానున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి: క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న దుస్తులను ఈ నెల 23న కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్‌లో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు సింగరేణి తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు అందుకుంటున్న విద్యార్థినులు

కొణిజర్ల: కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల బాలికలు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.మానస తెలిపారు. వరంగల్ కిట్స్ కళాశాల్లో నిర్వహించిన పోటీల్లో డిస్కస్ త్రో విభాగంలో కళాశాల బీజెడ్‌సీ ప్రథమ సంవత్సర విద్యార్థిని ఎస్.శరణ్య బంగారు పతకం సాధించగా.. లాంగ్ జంప్‌లో పి.నాగమణి సిల్వర్ మెడల్, జావెలెన్ త్రో విభాగంలో ఎస్.సింధు సిల్వర్‌మెడల్, షాట్‌పుట్‌లో ఎస్.సింధు కంచు పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలికలను, పీడీని ప్రిన్సిపాల్ మానస, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే..



హెచ్ఎం శ్రీనివాస్‌కు రూ.25 వేలు చెక్కు అందిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు రాణించే విధంగా అదే గ్రామానికి చెందిన వల్లపునేని చైతన్యలక్ష్మి రూ.25వేలు చెక్కను హెచ్ఎం శ్రీనివాస్ కు అందించారు. ఈ మేరకు చైతన్యలక్ష్మి మాట్లాడుతూ.. ఈ నగదును హైస్కూల్ పేరున బ్యాంకులో డిపాజిట్ చేసి.. ఏడాదికి వచ్చే వడ్డీని ‘పది’లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘యండ్రపూడి’ సేవలు మరువలేనివి



రామచంద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైరా: వైరా పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యండ్రపూడి రామచంద్రరావు ఇటీవల మృతి చెందారు. ఈమేరకు శుక్రవారం ఆయన దశదినకర్మ నిర్వహించగా కాంగ్రెస్ నాయకులు పలువురు రామచంద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. కాంగ్రెస్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు రాజశేఖర్, రాజశేఖర్, శబరినాథ్, రామారావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ



మాలమహానాడు జెండా ఎగువేస్తున్న నాయకులు

కారేపల్లి: రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణకు తెర లేపారని మాలమహానాడు మండల అధ్యక్షుడు సోమందుల రాములు అన్నారు. శుక్రవారం కారేపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల విశ్వేశ్వరావు 17వ వర్ధంతిని.. మాల మహానాడు మండల కన్వీనర్ మైప పీరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు జెండాను ఎగురవేసి, విశ్వేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చంద్రప్రకాశ్, వెంకటేశ్వర్లు, నాగరాజు, చందూ, రత్తయ్య, నిర్మల, అనీల్, రమేష్, యుగేందర్, నరేష్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



వందనం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశంలో పాల్గొన్న అధికారులు

చింతకాని: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మొదటి రోజు శుక్రవారం వందనం, కొదుమూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ప్రతి ఒక్కరికీ చేరుకోవాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యమని తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, అన్న యోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, గరీబ్ కల్యాణ్, ఆవాస్ యోజన, జీవన జ్యోతి, బీమా యోజన, ఉజ్వల యోజన వంటి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలు పథకాలను సంబంధించి అర్హులను గుర్తించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్‌లు కొరిపల్లి సునీత, నక్కన బోయిన సుజాత, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, మండల వైద్యాధికారి ఎండీ అల్తాఫ్, మండల వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య, పల్లె దవాఖానా వైద్యులు తబుసం, సీహెచ్ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణారావు, రేచల్‌రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు చెవుల మహేష్, ఈశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి గ్రామ పంచాయతీలో..



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ బాబురావు

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామ పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ పథకమైన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం అన్ని శాఖల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ బాబురావు రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రవి, నాగరాజు, ఏఓ పవన్‌కుమామర్, ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్ మేనేజర్ పి.హనుమంత్ నాయక్, సర్పంచ్ పెద్దభద్రయ్య, ఉపసర్పంచ్ సత్యనందం, గోపాలకృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని ప్రకటించాలి



మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు



నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, విజయ్

కల్లూరు: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఇమేజ్ గార్డెన్స్‌లో రాయల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన యూటీఎఫ్ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, శ్రామిక ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని, పీఆర్‌సీని సాధ్యమైనంత త్వరగా ప్రకటించాలని కోరారు. అనంతరం 2024కు సంబంధించి నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాయల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కొడిశాన విజయ్‌ఖుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.అమర్నాథ్, బి.ఇందుప్రియ, కోశాధికారిగా వేముల శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎ.రాజు, బి.రాంబాబు, ఎ.శుభాన్, ఆర్.సత్యనారాయణ, జి.వెంకటయ్య, జి.జ్యోతి, మండల ఆడిటర్‌గా సుధీర్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వీవీ రామారావు, శ్రీకాకుళం సతీష్, కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘మా భూములను ఆక్రమించారు...’



వివరాలను వెల్లడిస్తున్న రైతులు, నాయకులు

కారేపల్లి: వ్యవసాయ భూములను ఓ వ్యక్తి తన పలుకుబడితో ఆక్రమించారని.. ఈమేరకు తమకు న్యాయం చేయాలని మండలంలోని ఉసిరికాయలపల్లి, లావుడ్యాతండా, ఆలియాతండా గ్రామాలకు చెందిన రైతులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం రైతులు పచ్చిపాల భద్రయ్య, పచ్చిపాల రాములు, బోడా దేవి, భూక్యా తారాచంద్, ధారావత్ రాంజీ తదితరులు విలేకరులతో మాట్లాడారు. సర్వేనంబర్ 548లో మాజీ ఆర్‌టీఐ కమిషనర్ శంకర్‌నాయక్ బై నంబర్లు సృష్టించి తమ ఆధీనంలో ఉన్న భూములను వారి కుటుంబీకుల పేరిట పట్టాలు చేయించుకున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకుడు కొండబోయిన నాగేశ్వరరావు, సంత గుడి చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎం.డీ.హనీఫ్, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ధరావత్ భద్రునాయక్, బీఆర్ఎస్ నాయకులు బోడా రవి, వెంకట్, సాంబ, దేగల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆరోపణలు అవాస్తవం..

ఈ విషయమై శంకర్‌నాయక్‌ను వివరణ కోరగా.. వారు చేస్తున్న ఆరోపణలు అవాస్తమని కావాలని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అన్ని ఆధారాలతో మీడియా ముందుకు వచ్చి వివరణ ఇస్తానని ఆయన వెల్లడించారు.

ముక్కోటికి ఆలయాలు ముస్తాబు



సత్తుపల్లి శ్రీకోదండ రామాలయం

సత్తుపల్లిటౌన్: ముక్కోటి ఏకాదశి పర్వదినానికి సత్తుపల్లిలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శనివారం తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వారదర్శనంలో స్వామిని భక్తులు దర్శించుకునేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పట్టణంలోని శ్రీకోదండ రామాలయం, శ్రీగీతాజ్ఞాన మందిరం, మెట్టాంజనేయస్వామి ఆలయంలలో ముక్కోటికి ఏర్పాట్లు చేశారు.

జమలాపురంలో ఏర్పాట్లు..

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతి జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23న నిర్వహించే వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారిని భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మండపాలను ముస్తాబు చేశారు. క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు తెలిపారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు గణిత దినోత్సవం ప్రాధాన్యతను తెలియజేసి గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. కాగా, పలు విద్యాలయాల్లో నిర్వహించిన మ్యాథ్ ఎక్స్‌పోలో విద్యార్థుల గణిత ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లిటిల్‌ఫ్లవర్స్ యాజమాన్యం



సత్తుపల్లిటౌన్: డాక్టర్ కేకేఆర్ పాఠశాలలో విద్యుత్ శాఖ ఏడీఈ ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం



ఎర్రుపాలెం: కేజీబీవీలో..



తల్లాడ: అన్నారుగూడెం పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు



ఎర్రుపాలెం: జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



కల్లూరు: విజ్ఞాన్ విద్యానికేతన్‌లో